# ఓటర్ ఎపిక్ కార్డు లేకున్నా.. ఓటేయవచ్చు

- 12 గుర్తింపు కార్డులలో ఒక్కటున్నా ఓటుకు వినియోగం
- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- హైదరాబాద్ ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ): ఓటర్ ఎపిక్ కార్డు లేకుండా భారత ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉన్నప్పటికీ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని హైదరాబాద్ ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ వెల్లడించారు. ఎన్‌రోల్ జాబితాలో పేరు సరిచూసుకుని, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్, బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఫొటోతో కూడిన పాస్ బుక్, లేబర్ శాఖ ఇచ్చే హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌పీఆర్, ఆర్‌జీఐ స్మార్ట్ కార్డు, పాస్‌పోర్టు, ఫొటోగ్రాఫ్‌తో కూడిన పింఛన్ డాక్యుమెంట్, ఫొటోతో కూడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సర్వీస్ ఐడీ కార్డు, ఎంపీ, ఎంఎల్‌ఏ, ఎంఎల్‌సీ ఐడీ కార్డు, సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ జారీ చేసే యూనిక్ డిజబులిటీ ఐడీ కార్డు ఉంటే ఓటు హక్కును వినియోగించవచ్చన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ మాట్లాడారు. అక్టోబర్ 4న ప్రచురితమైన తుది ఓటర్ జాబితా అనంతరం 1,35,756 దరఖాస్తులు అందాయని, ఇందులో 83 వేలు క్లియర్ చేశామన్నారు. ఓటర్ చిరునామాను మార్చుకునే అవకాశం ఉన్నదని సంబంధిత బీఎల్‌ఓ లేదా ఓటర్ హెల్ప్ లైన్ అప్‌లోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజు 15 వేల వరకు నూతన ఓటర్ నమోదుకు దరఖాస్తులు అందాయని తెలిపారు. ఫారం–8 ద్వారా 1.032 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 45 వేల డూప్లికేట్, డెత్ ఓటర్లను తొలగించినట్లుగా వివరించారు.

### నామినేషన్‌కు సంబంధించి ఏర్పాట్లు..

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లుగా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశామన్నారు. నామినేషన్లకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. సంబంధిత కార్యాలయాలన్నీ వీడియో సర్వైలెన్స్‌లో ఉంటాయన్నారు. ఆర్ఓ కార్యాలయాల వద్ద వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆర్వో అధికారి వద్దకు ఐదుగురు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యాలయంలో ప్రతి కదలికపై వీడియో చిత్రీకరణ జరుగుతుందన్నారు. నవంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. నవంబర్ 15న విత్ డ్రా తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులపై క్లారిటీ వస్తుందన్నారు. ఆ వెంటనే ఇంటింటికీ వెళ్లి ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే మొదటి దశ ఈవీఎంల పరిశీలన పూర్తి కాగా, జిల్లాలోని 15 నియోజకవర్గాల్లోని ఆర్వోలకు అందజేసినట్లుగా తెలిపారు. నవంబర్ 15 తర్వాత రెండో దశ పరిశీలన కూడా చేస్తామన్నారు.

### నగదు విడుదలకు సత్వర చర్యలు

పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్న నగదు, బంగారం, ఇతర విలువైన వస్తు సామగ్రిని విడుదల చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు రోజువారీ విచారణ చేసి వెంటనే విడుదల చేస్తున్నారన్నారు.



## దేశ సమగ్రతను కాపాడాలి

- ఏక్తా దివస్‌లో జలమండలి ఎండీ దానకిశోర్

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): దేశ సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిదని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏక్తా దివస్ కార్యక్రమంలో ఎండీ దానకిశోర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ వేడుకల్ని ఏటా నిర్వహిస్తున్నామన్నారు. దేశాన్ని సమైక్యంగా ఉంచడంలో ఆయన పాత్ర ఎంతో ఉన్నదని కొనియాడారు. దేశ సమగ్రతకు, భద్రతకు ప్రతిపౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బోర్డులోని ఉన్నతాధికారులు, ఉద్యోగులు దేశ సమగ్రత, ఐక్యత ముఖ్యమని, అందుకోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

## జీఆర్‌టీలో స్వర్ణ దీపావళి ఆఫర్లు..

జూబ్లీహిల్స్, అక్టోబర్ 31: జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ప్రత్యేక ఆఫర్లతో ఈ దీపావళికి కొత్త శోభ సంతరించుకోనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ పేర్కొన్నారు. తమిళనాడులో తంగ దీపావళి.. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో స్వర్ణ దీపావళి ఆఫర్లు వినియోగదారుల ఆనందాన్ని రెట్టింపు చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం నగరంలోని జీఆర్‌టీ షోరూమ్‌లలో దీపావళి ఆఫర్‌లను మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఆర్‌టీ జ్యువెల్లర్స్ 1964 నుంచి ఆభరణాల ప్రియుల్లో ప్రతిష్ఠాత్మకమైన పేరు సంపాదించిందని అన్నారు. జీఆర్‌టీలో వినియోగదారుల కోసం అద్భుతమైన ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులు.. దానికి సమానమైన బరువులో వెండిని ఉచితంగా అందుకుంటారని తెలిపారు. వజ్రాల కొనుగోలుపై ప్రతి కేరట్‌కు 25 గ్రాముల వెండిని ఉచితంగా పొందవచ్చని, వెండి వస్తువులపై 25 శాతం తగ్గింపును, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును పొందవచ్చని ప్రకటించారు.

## బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 31 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఐఈఐ చైర్మన్‌గా వెంకటసుబ్బయ్య ఎన్నిక

ఖైరతాబాద్, అక్టోబర్ 31 : ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్‌గా డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా డాక్టర్ కె.సీతారాంబాబు నియమితులయ్యారు. వీరు 2023–24, 2024–25 వరకు ఈ పదవుల్లో కొనసాగుతారు.

## మాదిగలను మోసం చేసిన బీజేపీకి బుద్ధి చెబుతాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, అక్టోబర్ 31: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన బీజేపీ నాయకులు పదేండ్లు కావస్తున్నా వర్గీకరణ ఊసెత్తకుండా మాదిగలను మోసం చేసిందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, జాతీయ అధ్యక్షుడు మేడిపాపయ్య మాదిగ మండిపడ్డారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగల న్యాయమైన వర్గీకరణ డిమాండ్ పరిష్కరించకుండా మాదిగలను మోసం చేసిన బీజేపీ తీరును ఎండగట్టడానికి నవంబర్ 5వ తేదీన ఇందిరాపార్కు వద్ద మాదిగల యుద్ధభేరి సభ నిర్వహించతలపెట్టినట్టు తెలిపారు. కేంద్రం మెడలు వంచి వర్గీకరణ సాధించే దిశగా నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంఆర్‌పీఎస్ యుద్ధభేరి సభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కొండ్ర శంకర్, డాక్టర్ మల్లేశం, పొట్టపెంజర రమేష్, బాబురావు, చింతబాబు, మోహన్, రుక్కమ్మ, లక్ష్మి, మంచాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

## హత్యా రాజకీయాలను ఖండిస్తున్నాం..

- మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్/మల్కాజిగిరి, అక్టోబర్ 31: ప్రజాక్షేత్రంలో ఉన్న ఎంపీ ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దాడి ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన చేసిన దాడిలా ఉన్నదన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని హత్యా రాజకీయాల వైపు కాంగ్రెస్, బీజేపీలు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఎదుర్కోలేక హత్యా రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్, బీజేపీలకు ఓటర్లు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారం కోసం అనేక అడ్డదారులు తొక్కుతున్న కాంగ్రెస్ పార్టీకి.. అది అందని ద్రాక్షేనని అర్థమైందన్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ దూసుకుపోవడంతో, కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమని సర్వేలు ముక్తకంఠంతో చెబుతున్నాయన్నారు. అది చూసిన రేవంత్ రెడ్డి బ్యాచ్‌కి ఓటమి తప్పదన్న విషయం అర్థమైందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ మురుగేశ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, సర్కిల్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, జేఏసీ వెంకన్న, ఖలీల్, రాముయాదవ్, అనిల్ కిశోర్, డోలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు శ్రమించాలి

- అడోబ్ సీఈవో శంతను నారాయణ్


విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న శంతను నారాయణ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 31: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు నిరంతరం శ్రమించాలని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ పిలుపునిచ్చారు. కష్టాలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసినప్పుడే విజయం సాధించవచ్చని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఓయూ ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి అయిన శంతను ముందుగా తన విభాగాన్ని సందర్శించి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం కళాశాల ప్రధాన భవనంలోని అసెంబ్లీ హాల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తూ, వారు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇంజినీరింగ్ చదివే రోజుల్లో చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా ఉండేవాడినని చెప్పారు. తాను టెన్నిస్‌ను ఇష్టంతో ఆడేవాడినని పేర్కొన్నారు. అమెరికాలో మాస్టర్స్ చదివేందుకు వెళ్లి, ఆ తరువాత అడోబ్ కంపెనీలో చేరే వరకు తన ప్రస్థానాన్ని వివరించారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## పాస్‌పోర్ట్ కార్యాలయాల్లో.. విజిలెన్స్ అవేర్నెస్ వీక్

సిటీబ్యూరో, అక్టోబర్ 31 ( నమస్తే తెలంగాణ ) : రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో 'విజిలెన్స్ అవేర్నెస్ వీక్'ను రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య ప్రారంభించారు. 'సే నో టూ కరప్షన్ కమిట్ టు ద నేషన్' థీమ్‌తో నవంబర్ 5 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.